# వయొలిన్.......... పి. నాగేశ్వరరావు





**'అమ్మా! ఈ రోజు శనివారం. నాన్నగారి ప్రోగ్రాం ఇవాళే రేడియోలో వస్తుంది' —స్కూలు నుంచి వచ్చి పుస్తకాల సంచిని కొక్కానికి తగిలిస్తూ అరిచాడు పదేళ్ళ కల్యాణ్.**

"గుర్తుంది లేవోయ్ నీకే పెద్ద గుర్తున్నట్లు.... సరేగాని టిఫిన్ తిని ఆడుకోవడానికి వెళ్ళు" అంది కల్యాణ్ తల్లి సరస్వతమ్మ.

"అంతా అబద్ధం.... నేను గుర్తుచేసే వరకూ నీకీ విషయం జ్ఞాపకమేలేదుకదూ! అవునా? కాదా? నిజంచెప్పకపోయావో నేను టిఫిన్ తిననే తినను."

"సరే.... నీకే గుర్తుంది" — కొడుకు మొండి పట్టుదలకు నవ్వుతూ టిఫిన్ తెచ్చి పెట్టింది సరస్వతమ్మ.


తన భర్త ఎంతోకాలంనుండి ఎదురు చూస్తున్న అవకాశం వచ్చిన ఆరోజును తను అంత త్వరగా మరచిపోగలదా!

కేశవరావు చాలా పట్టుదలతో "వయొలిన్" నేర్చుకొన్నాడు. పెళ్ళికాక పూర్వం నుండి ఆ వాయిద్యంలో తానేదో సాధించాలని తహతహ లాడిపోతూ వుండేవాడు పెద్ద పెద్ద కచ్చేరీలలో తను వయొలిన్ వాయించాలని. పేరు ప్రతిష్ఠలు గల విద్వాంసుల ప్రక్క వాయిద్యం తానే వాయించాలనీ. రేడియో ప్రోగ్రాంలు యివ్వాలనీ కలలు కన్నాడు. ఒక విద్వాంసుడిగా పేరు ప్రతిష్ఠలుగానీ. డబ్బును గానీ సంపాదించాలంటే ప్రజ్ఞ ఒక్కటే చాలదని అనతికాలంలోనే గ్రహించాడు. అయినా ప్రయత్నాలు మాత్రం విరమించలేదు. ఎలాగైతేనేం చివరకు ఒక హరికథకు ప్రక్కవాయిద్యం వాయించగల్గే అవకాశం కలిగినందుకు యెంతగానో సంతోషించాడు. తనకున్న పరిజ్ఞానాన్నంతా చూపాలనే వుద్దేశ్యంతో కృషి చేశాడు. 'కృతకృత్యు డ్నయ్యాను' అనే ఆత్మ సంతృప్తి కల్గింది.

---

## ప రి చ య ం

జన్మస్థలం : చింతలపూడి (పశ్చిమ గోదావరి జిల్లా). చదువు : బి. కామ్. వయసు : 24 సంవత్సరములు. ఉద్యోగం : ప్రస్తుతం నిరుద్యోగ పర్వం. కాలేజీ మ్యాగజైనులో



కథ వ్రాసినప్పటి నుంచి రచయితగా అప్పుడప్పుడు వ్రాస్తూ వుంటాను. "విద్యావాహిని" పక్ష పత్రిక సంపాదకులు జగన్నాథరావుగారి ప్రోత్సాహం నాకు వుంది. ఇకపోతే "ఉపాధ్యాయ" పత్రికలో ఈమధ్య ఒక కథ ప్రచురించబడింది. హైక్లాస్ ఫామిలీ గురించి యద్దనపూడి శ్రామిక జీవుల గురించి మాదిరెడ్డి బాగా వ్రాయగలిగారని నా నమ్మకం. ప్రతీ పుస్తకం చదవటం. ప్రతి మనిషినీ అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం ఇవీ నా అలవాట్లు.

—పి. నాగేశ్వరరావు

---

"ఏమిటమ్మా ఆలోచిస్తున్నావు?".... టిఫిన్ ముగించివేస్తూ అన్నాడు కల్యాణ్.

ఉలిక్కిపడింది సరస్వతమ్మ. "ఏమీ లేదు" అని మాత్రం అంది.

"సరే.... నేను వెళుతున్నాను.... పెందలకాడే వస్తాను".... అంటూ పరుగెత్తాడు కల్యాణ్.

రికార్డు చేసిన ప్రోగ్రాం ఈ రోజు వస్తుందని తెలిసి కొంచెం పెందలాడే ఇల్లు చేరాడు కేశవరావు.

త్వరగా భోజనాలు ముగించి అందరూ రేడియో చుట్టూ చేరారు. ఆసక్తిగా కార్యక్రమం వినడంలో లీనమయ్యారు.

* * *

"మీరింతవరకూ 'సీతారామ కల్యాణం' హరికథా కాలక్షేపం విన్నారు. కథకులు శ్రీ భరద్వాజ. మృదంగం కనకరాజు. ఇంతటితో ఈ రోజు కార్యక్రమాలు సమాప్తం. రేపు ఉదయం మళ్ళీ కలుద్దాం. అంతవరకూ సెలవామరి.... జైహింద్" ఆకాశవాణి అనౌన్సర్ పలికాడు.

అందరూ నిశ్శబ్దంగా వున్నారు.

ఇంత కాలానికి కనీసం ఒక్కసారైనా తన కార్యక్రమం రేడియోలో వచ్చినందుకు కేశవరావుకు చెప్పలేనంత ఆనందంగా వుంది.

భర్త ఆనందంలో తానూ పాలు పంచుకొంటూ అవ్యక్తమైన ఆనందపు టలల్లో సంచరిస్తోంది సరస్వతమ్మ మనసు.

కల్యాణ్ ఏదో ఆలోచిస్తున్నాడు హఠాత్తుగా—

"నాన్నగారూ! మీరు ఇంత కష్టపడి వయోలిన్ వాయించారుకదా! మరి మీ పేరెందుకు రేడియోలో చెప్పలేదు"—

కల్యాణ్ ప్రశ్నతో అవాక్కయ్యాడు కేశవరావు. తనకొడుకు అడిగినదానిలో తప్పులేదనిపించింది. తాను పొందిన ఆనందమంతా ఒక్కసారి అగ్నిలోపడి కాలిపోయినట్లనిపించింది. తన కొడుక్కి ఏం సమాధానం ఇవ్వగలడు? చిక్కటి పాలు తెచ్చిపెట్టి ఆ పాలు త్రాగినతర్వాత ఆ పాలలో ఒకే ఒక చుక్క విషం కలిపింది.... అని చెప్పినట్లనిపించింది.

మళ్ళీ అదేప్రశ్న వేశాడు కల్యాణ్.

"ఊరుకోరా వెధవా! పేరు చెప్పకపోతే ఏం!" భర్త ముఖకవళికలు గమనించిన సరస్వతమ్మ కొడుకును కసురుకొంది.

"నాకు వారికున్నంత పేరు ప్రతిష్ఠలు లేవుగదా! ముఖ్యమైనవారి పేర్లే చెపుతారు" అనిమాత్రం అనగలిగాడు.

అయినా ఆ సమాధానం తనకొడుక్కి నచ్చలేదని అతని ముఖమే చెప్తోంది.

ఆ రాత్రి కేశవరావుకి నిద్రపట్టలేదు. చుట్టూ చీకటి....భరింపలేని నిశ్శబ్దం....ఆ నిశ్శబ్దంలో "నాన్నా నీ పేరెందుకు రేడియోలో చెప్పలేదు?" కొడుకు ప్రశ్న ప్రతిధ్వనిస్తున్నట్లుగా వుంది. లేచి లైటు వేశాడు....వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు. టేబిల్‌పైనున్న పుస్తకం చదువుదామని ప్రయత్నిస్తున్నాడు కానీ మళ్ళీ అవే ఆలోచనలు.... తన పేరు చెప్పకపోతే ఆ వాయిద్యం ఎవరు వాయించారని అనుకొంటారు శ్రోతలు? కనీసం తన కొడుక్కి కల్గిన ఈ సందేహం ఎంతమందికి కల్గదు? అవే ఆలోచనలతో బాధతో మనసు మండిపోతుంది! వాయించినప్పుడు పొందిన తృప్తి ఇప్పుడు కల్గడం లేదు. పేరు చెప్పకపోవడంవల్ల తనకేమీ నష్టం లేదు. కానీ ఏదో తెలియని వెలితి. గంట గడిచినా అతని దృష్టి నిల్పిన పేజీ మాత్రం తిరగలేదు. మనసు మాత్రం సుడిగుండంలోపడి గిరికీలు కొడుతున్నట్లుగా వుంది అన్ని ఆలోచనలతో ఎప్పటికో కుర్చీలోనే నిద్రపోయాడు కేశవరావు.

రెండు రోజులు గడిచాయి. కేశవరావు మనసు ఇంకా బాధగానే వుంది. దూరంగా ఒక పెట్టెపై వున్న వయోలిన్ కూడా తన కేసి జాలిగా చూస్తున్నట్లుగా వుంది.

ఒక మనిషి మానసికంగాబాధపడుతున్నప్పుడు పరిసరాలన్నీ తననే గమనిస్తున్నట్లుగా ఫీలవుతూంటాడు. మౌనంగా వుండే ప్రతిదీ తన దైన్యాన్ని చూసి సానుభూతి చూపుతున్నట్లుగా వుంటుంది. అందుకే బాధ మరింత పెరిగిపోతూ వుంటుంది.

రేడియో మ్రోగుతూనే వుంది. ఆ సమయంలో ఉత్తరాల కార్యక్రమం జరుగుతూంది. అప్రయత్నంగా అతని చెవులు ఆసక్తిగా వినసాగాయి.

"మీరు శనివారం ప్రసారంచేసిన "సీతారామకల్యాణం" హరికథ చివరన ఒక్క మృదంగ విద్వాంసుని పేరు మాత్రమే చెప్పారు. కానీ నిజానికి అత్యంత మధురంగా వాయించిన వయోలినిస్ట్ పేరుమాత్రం చెప్పలేదు. ఆకాశవాణి వారు ఈ విషయంలో చిన్నచూపుచూడడం బాగుండలేదు అంటున్నారు- వీరిపేరు..."

ఆ ఉత్తరంవిన్న కేశవరావు మనస్సు ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయింది. బీడువారిన భూమిలో కుండపోతగా వర్షం కురిసినట్లయింది. వెంటనే తనకొడుకుని పిలిచి ఆ విషయం చెప్పాలని అనిపించింది. అప్పటికే కల్యాణ్ నిద్రపోతున్నాడు.... తిరిగివచ్చి కుర్చీలో కూర్చొన్నాడు.

తనపేరు పైకి చెప్పనక్కరలేదు. తన వాయిద్యంతో శ్రోతల మనసును రంజింపజేయగల్గితే చాలు అదే తనకు పదివేలు. కళాకారుడికి శ్రోతల....ప్రేక్షకుల అభినందనలే ఎంతో తృప్తిని యిస్తాయి. అప్పుడే అతనికి నిజమైన ఆనందం కలుగుతుంది. ఇప్పుడే గనక తన కొడుకు విని వుంటే ఎంత ఆనందపడతాడు. మండుతున్న మనసు చల్లబడింది. ఏమిటో ఈ రోజు అందరూ పెందలకాడే నిద్రపోయారు. ఆలోచనలతో తనకు నిద్రే పట్టలేదు. నిద్రపోక పోవడమే మంచిదయింది. లేకపోతే ఈ విషయం విని ఆనందించేఅదృష్టాన్ని కోల్పోయేవాడు.

ఈ ఆలోచనలలో. ఈ మూగ సంభాషణలోపడి ఆకాశవాణివారు తమ పొరపాటును సరిదిద్దుకొని వయోలినిస్ట్ పేరును శ్రోతలకు వినిపించడం కూడా కేశవరావుకు వినిపించలేదు. ●

---

## అంకితం

"అవకాశాలు రాక మరుగున పడిపోతున్న ఎందరో అజ్ఞాత కళాకారులకు సానుభూతితో ఈ మినీ కథను మాత్రమే అంకితం చేయగలుగుతున్నా!"

—రచయిత

